క్లుప్తంగా

ఓటరు స్లిప్‌ల పంపిణీ



కోయిల్‌కొండ: ప్రజలకు ఓటరు స్లిప్‌లను త్వరగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను ఎవరైనా ప్రలోబాలకు గురిచేస్తే ఫిర్యాదు చేయాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



అడ్డాకుల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మాక్ పోలింగ్ ఆకట్టుకుంది. ఎన్నికల నిర్వాహణపై అవగాహన కల్పించడానికి చేపట్టిన మాక్ పోలింగ్‌లో విద్యార్థులంతా పాల్గొన్నారు. పోటీలో నిలిచిన అభ్యర్థులకు ఓట్లు వేశారు. మాక్ పోలింగ్‌లో విద్యార్థి శివ గెలుపొందగా నిర్వాహకులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ మైక్రోబయోలజీ డిపార్ట్‌మెంట్ రీసెర్చ్ స్కాలర్ రాజ శ్రీనాథ్‌కు సోమవారం పీయూ అధికారులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయన మైక్రోబయోలజీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు ప్రొఫెసర్ పిండి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో 'సూక్ష్మజీవుల సంవర్ధనం, సంవర్ధనం చేయలేని లైపేజ్, ప్రొటియేజ్ ఎంజైమ్స్' అంశంపై రీసెర్చ్ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయనను పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, తదితరులు అభినందించారు. అధ్యాపకులు శాంతిప్రియ, మధుసూదన్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



హన్వాడ: ఓటుహక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రాజునాయక్ కోరారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఓటరు హాజరు శాతంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎస్ నోడల్ ఆఫీసర్ వెంకట్రాములు, జీహెచ్ఎంలు అబ్దుల్ సమద్, నిర్మలాదేవి, ఆర్‌పీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్‌పై వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు మార్కెటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ప్రారంభించి మార్కెటింగ్ అంశాలపై పలు సూచనలు చేశారు.

ముమ్మరంగా ప్రచారాలు

- మహమ్మదాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ బీఆర్ఎస్‌పై ప్రజల్లో నమ్మకం పోయిందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల బూత్‌లెవల్ నాయకులు పాల్గొన్నారు.
- అభివృద్ధిని చూసే ప్రజలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నాయపల్లిలో ప్రచారం చేశారు. పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వైస్‌ఎంపీపీ ఈశ్వర్‌గౌడ్, సర్పంచ్ మధులత తదితరులు పాల్గొన్నారు.
- రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తేస్తేనే సమర్థవంతమైన మంచి పాలన అందుతుందని అభ్యర్థి కొండా ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రాచాల, పొన్నకల్ గ్రామాల్లో సోమవారం ప్రచారం చేశారు.
- అబద్ధపు మాటలతో ప్రజలను మభ్యపెట్టలేరని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అదే విధంగా అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి అవకాశం ఇవ్వండి



బుద్దారంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌లకు ఘనస్వాగతం పలికిన కార్యకర్తలు



దొర్రితండాలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- 55ఏళ్లుగా ఏమీ చేయని కాంగ్రెస్ ఇప్పుడెలా చేస్తుంది
- కాంగ్రెస్, బీజేపీ మాయమాటలను నమ్మొద్దు
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ : గడిచిన పదేళ్లలో తాము ఎన్నో పనులు చేశామని.. అభివృద్ధిని చూసి మరింత మెరుగు పర్చుకొనేందుకు మరోసారి అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం బుద్దారం, కారంతండా, దొర్రితండాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆయన మరో అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతానని అన్నారు. మాజీ మంత్రి పి. చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ల సహకారం మరువలేనిదని, దివంగత ఎమ్మెల్యే ఎర్రసత్యం దీవెనలు తనకు అందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడారు. గతంలో ఎవరూ చేయలేనంతగా అభివృద్ధి పనులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేయడం అభినందనీయమన్నారు. మళ్లీ శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు బైక్‌ర్యాలీలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, నాయకులు నరేందర్, రమణారెడ్డి, అనంతరెడ్డి, బాలయ్య, లక్ష్మయ్య, చెన్నయ్య, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహబూబూబ్‌నగర్ పట్టణ ఫంక్చర్ షాప్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా కోఆర్డినేటర్ ప్రశాంత్‌నాయక్‌లతో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో పాటు మైనార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పాల్గొన్నారు.

రత్నం అపార్ట్‌మెంట్ ఆత్మీయ సమ్మేళనం

జిల్లా కేంద్రంలోని రత్నం అపార్ట్‌మెంట్ లో సోమవారం ఆ అపార్ట్‌మెంట్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అబివృద్ధి చేసినట్లు తెలిపారు. అబివృద్ధిని కొనసాగించలంటే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలన్నారు. మున్సిపల్ చైర్మన్ నర్సిములు, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, కృష్ణమోహన్, భాస్కర్‌రావు, వెంకట్రాములు, రమణ, నటరాజు, తిరుపతిరెడ్డి, రత్నం, జావేద్, సతీష్, జన్ను పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

స్మార్ట్ సిటీగా మారుస్తాం



చిన్నారులు అందజేసిన రామమందిరం చిత్రలేఖనంతో బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి తదితరులు

బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తనను గెలిపిస్తే పాలమూరును స్మార్ట్ సిటీగా మారుస్తామని బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం రాత్రి రాఘవేంద్రస్వామి గుడి కమాన్, న్యూప్రేమ్‌నగర్, ప్రేమ్‌నగర్, సద్దలగుండు, స్టేషన్ ఏరియా, శివాలయం తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో మున్సిపాలిటీ పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తామన్నారు. 'సారు.. కారు.. పరారీ..' అంటూ ఎద్దేవా చేశారు. పేపర్ లీక్ చేయించి నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ నేతలు ఆటలు ఆడుకుంటున్నారని ఆరోపించారు. జిల్లాలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దౌర్జన్యాలు మితిమీరిపోయాయని విమర్శించారు. మొన్నటివరకు బీజేపీలో ఉండి రాత్రికి రాత్రే కాంగ్రెస్‌లో చేరి వేషం మార్చిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆ పార్టీ కార్యకర్తలను సైతం నిండా ముంచుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మితే గోసే..

నవాబుపేట: కాంగ్రెస్ మాయ మాటలు నమ్మితే గోస పడాల్సి వస్తుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం రుక్కంపల్లి, లింగంపల్లి, చౌడూర్, కాకర్‌జాల్, వెంకటేశ్వరతండాలో ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ కేవలం ఎన్నికల కోసం హామీలు ఇవ్వరని.. అభివృద్ధి కోసమే పాటుపడతారని అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలకు అర్థం లేదన్నారు. మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, చెన్నయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, రాంప్రసాద్, సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బులెట్టు బండిపై సోమవారం మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. లింగంపల్లిలో బతుకమ్మలతో, రుక్కంపల్లిలో బోనాలతో స్వాగతం ప్రజలు స్వాగతం పలికారు.



ఇప్పటూర్‌లో బులెట్టుబండిపై వస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: జడ్చర్ల బార్ అసోసియేషన్ బీఆర్ఎస్‌కు మద్దతుగా మండలకేంద్రంలో ప్రచారం నిర్వహించింది. ప్రెసిడెంట్ విశ్వేశ్వర్, న్యాయవాదులు యాదిరెడ్డి, జంగయ్య, అశోక్, పురుషోత్తం రావు, పాండు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సోమవారం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల వారు భారీగా బీఆర్ఎస్‌లో చేరారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు



కోయిల్‌కొండలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట/కోయిల్‌కొండ : 'బంగారు తెలంగాణ దిశగా అన్ని రంగాల్లో అభివృద్ధిలో...ప్రజా సంక్షేమంలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ సర్కారే...హ్యాట్రిక్ సీఎం అయ్యేది సీఎం కేసీఆరే' అని బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నారాయణపేట నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోసారి గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే వివిధ నూతన పథకాలను అమలు చేస్తామని భరోసానిచ్చారు. కోయిల్‌కొండ, గాంధీనగర్, చింతల్‌తండా, జమాల్‌పూర్, పలుగుతండా, అనంతపూర్ గ్రామాల్లో ప్రచారాన్ని హోరెత్తించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని, రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. రాష్ట్రం పదేళ్లక్రితం ఎలా ఉందో ప్రజలు గమనించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి మూడు గంటలే కరెంట్ ఇస్తుందని రాజేందర్‌రెడ్డి అన్నారు.

కోటకొండకి చెందిన కమ్యూనిస్టు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ధన్వాడ మండలంలోని గున్ముక్ల, యంనోనిపల్లి, రాంకిష్టయ్య పల్లి గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులను పార్టీలోకి ఆహ్వానించారు. దామరగిద్ద మండలంలోని మద్దేల్ బీడు, వత్తుగుండ్ల, కానుకుర్తి గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. నారాయణపేట బీజేవైఎం ప్రధాన కార్యదర్శి పల్లా రఘు, నగర కార్యదర్శి రాజగోపాల్‌లు గులాబీ గూటికి చేరారు.



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి

కమలం...కాంగ్రెస్‌లవి మాయమాటలు

కమలం, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మే పరిస్థితిలో జనం లేరని ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 8వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. అధికారమే పరమావధిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్, బీజేపీ కుట్రలను ప్రజలకు అర్థ మయ్యేలా వివరిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్ ప్రభుత్వం పై చేస్తున్న ప్రచారంలో నిజానిజాలు తమకు తెలుసని ప్రజలు బీఆర్ఎస్‌కు బాసటగా నిలిచి నారాయణపేట నియోజకవర్గ మరింత అభివృద్ధి చేసేందుకు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఎస్ఆర్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని ఓటర్లను అభ్యర్థించారు.

కురుమూర్తి జాతరలో మంగళసూత్రాల అపహరణ

చిన్నచింతకుంట: కురుమూర్తి జాతరలో ఇద్దరు మహిళా భక్తుల మంగళసూత్రాలు అపహరణకు గురైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతర కోనేరులో భక్తులు స్నానాలు ఆచరిస్తుండగా ఘటన చోటు చేసుకున్నట్లు వారు వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లా కోటకద్ర గ్రామానికి చెందిన కోస్గి మంజుల (4 తులాలు), గద్వాల పట్టణానికి చెందిన కోరి స్వాతి (2 తులాలు) మంగళ సూత్రాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని పేర్కొన్నారు. దీంతో ఇరువురు బాధితులు చిన్నచింతకుంట పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రైవేట్ ఆస్పత్రి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా టి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా రాజేష్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీను, సలహాదారులుగా గోపీ, రాజన్న, వెంకటేష్, ఆంజనేయులు, శివశంకర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల వారు పాల్గొన్నారు.

60ఏళ్లుగా చేయని అభివృద్ధి.. ఇప్పుడేం చేస్తారు

మదనాపురం: అసమర్థ కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి కొత్తగా చేసేదేమీ లేదని, 60 ఏళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడు కొత్తగా గెలిచి ఎలా చేస్తారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు.

మండలంలోని అజ్జకొల్లు, నెలివిడి, నర్సింగపురంలో సోమవారం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడారు. నర్సింగపూర్‌లో రూ.18.73 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సాగునీరు, 24 గంటలతో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రతిపక్షాలకు ఓట్లు అడిగే హక్కు లేదని, బీఆర్ఎస్ గెలిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య, సర్పంచ్‌లు బ్రహ్మమ్మ, కోట్ల రాములమ్మ, నాయకులు పాల్గొన్నారు.



నర్సింగాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

జిల్లా కవులకు సాహిత్య పురస్కారాలు



సాహిత్య పురస్కారం అందుకుంటున్న డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన కవులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి విమల సాహితి సమితి జాతీయ సాహిత్య పురస్కారాలను అందుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ జెల్ది విద్యాధర్‌రావు రచించిన 'తోటమాలి మాలిమి' పుస్తకావిష్కరణ సందర్భంగా నిర్వహించిన జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవంలో జిల్లా కవులు ఈ పురస్కారాలను అందుకున్నారు. జాతీయ పురస్కారాలను పద్మశ్రీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, ప్రజా వాగ్గేయకారులు గోరేటి వెంకన్న తదితరులు అందజేశారు.


జాతీయస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: అస్సాం రాష్ట్రం గౌహతిలో ఈనెల 23నుంచి 26 వరకు నిర్వహించనున్న సబ్ జూనియర్, జూనియర్ జాతీయస్థాయి యోగా పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు యోగా అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.బాల్‌రాజు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో యోగా క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలకు అండర్ 10–12 విభాగంలో పి.చరణ్, అండర్ 12–14లో సి.అఖిల్, జి.అవినాష్, అండర్ 14–16 విభాగంలో శిరీష, అండర్ 16–18లో ప్రవీణ్ ఎంపికైనట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభచాటి పతకాలు సాధించాలని కోరారు. ఆర్చరీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, యోగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

జనగళం

సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో జరిగిన అభివృద్ధి తోపాటు ప్రజల నుంచి కొన్ని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని వివిధ నియోజకవర్గాల ప్రజల నుంచి వ్యక్తమవుతున్న డిమాండ్లను పాలక పక్షంతోపాటు ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల ముందు ఉంచుతున్నాం.

కళాశాలలు ఏర్పాటు చేయాలి



గండీడ్ మండలంలో విద్యావంతుల సంఖ్య ఎక్కువగా ఉంది. అందుకు తగ్గట్టుగా ఉన్నత విద్యాభ్యాసానికి స్థానికంగా వనరులు లేవు. దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా ఆడపిల్లలకు ఇబ్బంది కలుగుతోంది. దీనివల్ల ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇక్కడ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ర్యాకం గంగాధర్, లెక్చరర్, గండీడ్

నిజాయితీగా ఓటేయాలి



ఎన్నికల సమయంలో ఓటర్లు ప్రలోభాలకు గురి కావొద్దు. రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చే తాయిళాలకు ఆశపడి మోసపొవద్దు. ఇచ్చిన హామీలను నెరవేర్చే వారిని గుర్తించి ఓట్లు వేయాలి. రాజకీయ పార్టీలు కూడా ఉచితాలతో ఓట్లు రాల్చుకోవాలని చూడకుండా అన్ని వర్గాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మేనిఫెస్టోలను ప్రకటించి వాటిని అమలు చేయాలి.

–రామస్వామి, మూసాపేట

కష్టాలు తీర్చేందుకు కృషి చేయాలి



ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులు ప్రజల కష్టాలను గుర్తించి వాటిని తీర్చేందుకు కృషి చేయాలి. దేవరకద్రలో రైల్వే గేట్ మూత వల్ల పాత బస్టాండ్ ప్రాంతంలో వ్యాపారులకు తీవ్ర నష్టం కలుగుతోంది. ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయకుండా తీసుకున్న నిర్ణయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా సమస్యను పరిష్కరిస్తే బాగుంటుంది.

–రాఘవేందర్‌రెడ్డి, దేవరకద్ర

కులవృత్తులకు ఆదరణ కల్పించాలి



తెలంగాణలో కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆదరించాలి. కులవృత్తి నైపుణ్యం పెంపొందించడానికి సహకారం అందించాలి. అందుకోసం అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. తద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయి.

– చాకలి వెంకటయ్య, కొండెడ్డిపల్లి